# మాదిరాజు వారి 'ఆనందధుని'

శ్రీ శివలెంక ప్రకాశరావు

ప్రతిజీవి ఈ భూమి మీద పడింది మొదలు మళ్ళీ ఆ పరమాత్మలో లీనం అయ్యేంతవరకూ, సముద్ర గర్భంలో కలిసే నదిలాగా తన శక్తి యుక్తులన్నీ ఉపయోగించుకొని ప్రతికూల వాతావరణాన్నీ, పరిసరాలనూ తన కనుకూలంగా మార్చుకొంటుంది. ఇదంతా జీవి ప్రతి క్షణమూ మృత్యుదేవత కబంధహస్తాలలోంచి తప్పించుకోవడానికి కొనసాగించే జీవయాత్ర. ఇట్లాంటి ప్రయత్నంలో పొందిన సంపూర్ణ విజయానికి ఒక ప్రతీకవంటిదే 'సతీసావిత్రి కథ.'

వ్యాసప్రోక్తమైన ఈ కథను అరవిందులు ఒక ఆధ్యాత్మిక ఆధునిక మహాకావ్యంగా మలిచినారు. అరవిందుల దృష్టిలో సావిత్రి సాక్షాత్తు గాయత్రీ స్వరూపిణియగు సావిత్రియే! మృత్యువునకూ, పునర్జీవనానికీ ఒక సేతువు. తమస్సును హరించిన ఒక దివ్య కాంతి. అశ్వము ఆధ్యాత్మిక శక్తికి ఒక ప్రతీక. అందుకనే అశ్వపతి ఆత్మజా సంకోసం నిరంతరమూ అన్వేషించే ఒక సాధకునకు ప్రతీక. అతడొనర్చిన పద్దెనిమిది సంవత్సరాల తపశ్చర్య ఒక ఆధ్యాత్మిక యోగసాధన.

ఇట్లాంటి మహద్గ్రంథాన్ని చదివిన తరవాత మాదిరాజు రంగారావుగారికి కలిగిన భావపరంపరయే ఈ 'ఆనందధుని' కావ్య స్వరూపం.

ఒక విశిష్ట దశలో మనస్సుపొందే ఆరోహణ పరంపరను మానవుని జీవయాత్రగా భావించి దీనిని మూడు దశలుగా కవి విభజించినారు. ఇట్లా విభజించటంలో ఒకవిశేషమున్నది. అరవిందుల అశ్వపతి సంతానంకోసం చేసిన యోగాభ్యాసము మూడు భాగాలు అందులో మొదటిది వ్యక్తిగా ఆధ్యాత్మిక సిద్ధిని పొందడం. రెండవది మానవుల ప్రతినిధిగా చైతన్య భూమికలను సాధించడం. ఇక మూడోది విశ్వమంతటికీ దివ్యచైతన్యం కలిగే మార్గాన్ని, జరిగే విధానాన్ని కనుక్కోవడం.' మనస్సుకతీతమైన ఈ తత్త్వాన్ని అతిమానసమంటారు అరవిందులు.

'తైత్తిరీయోపనిషత్తులో చెప్పిన అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలలో విజ్ఞానమయం బుద్ధికాదనీ, అదే అతిమానసమనీ అరవిందుల అభిప్రాయం.

ఈ సర్వజగత్సృష్టికీ 'జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి' అను మూడునూ అత్యంతావశ్యకములు. మొదటిదగు జ్ఞానమును బట్టి సృష్టి చేయవలెననెడి ఇచ్ఛ, దానినిబట్టి క్రియారూపము ధరించుట సంభవించును. జ్ఞానేచ్ఛల సమన్వయ స్వరూపమే ఒక మహాశక్తి. కావున అతిమానసమనగా జ్ఞానేచ్ఛల రూపమున వెలికి విస్తృతమగు సచ్చిదానందమే'!

ఈ సృష్టిలో అతిమానస దివ్యచేతన మూడు రూపములను ధరించినట్లు కనవచ్చు. అందులో మొదటిది వస్తుజాతపు అఖండైకత్వమున ప్రతిష్ఠితమైన రూపము రెండవది ఏకమున అనేకము, అనేకమున ఏకము అభివ్యక్తమగుటకు ఆధారమై నిలిచియున్నట్లుగా ఆ ఏకత్వమును మలచిన రూపము. మూడవది నానావిధములగు వ్యక్తిత్వావిష్కారమున ఆధార భూతమగునట్లుగా ఆ ఏకత్వములో మార్పునొందించిన రూపం. అసలు సావిత్రి మహాకావ్యమే మూడు భాగాలుగా అరవిందులచే వ్రాయబడింది. 'ఆయన దృక్పథానికి మూడు ఆధారాలున్నాయి. పరిణామక్రమం క్రిందనుంచి ఎలా పైకి పోతున్నదో, అలాగే పైనుంచి క్రిందికి దిగటంకూడా ఉంది. ఇది రెండూ ప్రక్కప్రక్కనే జరుగుతూ ఉన్నాయి అనేది మొదటిది. రెండవది: ఈ ప్రయాణంలో ఏ దశకా దశలో ఒక ఐక్యత, ఒక పూర్ణత కనబడుతుంది. మూడవది: అతి మనసు [Super mind] భావన. ఈ మూడింటి ఆధారంగానే దాదాపుగా వారి ['The life divine'] రచన సాగింది!

ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని మాదిరాజువారు 'ఆనందధుని' మూడు భాగాలుగా విభజించినారు.